సాక్షి చిత్తూరు

మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



రూ.కోటి కానుకలు

ఎంపీ మిథున్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని ఆటో డ్రైవర్లకు విజయవాడ దరిద్ది కానుకలు అందించారు.

- 8లో



ముస్తాబు ముమ్మరం

వరసిద్ధుని బ్రహ్మోత్సవాలకు కాణిపాకం ఆలయంలో శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

- 8లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	25
తిరుపతి	36	26
తిరుమల	30	21
గూడూరు	36	28
నగరి	36	26

న్యూస్‌రీల్

పిల్లలకు విధిగా వ్యాక్సిన్



వ్యాక్సినేషన్‌ను తనిఖీ చేస్తున్న రవిరాజు

చిత్తూరు రూరల్: చిన్న పిల్లలకు విధిగా వ్యాధి నిరోధక వ్యాక్సిన్లు వేయించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ రవిరాజు ఆదేశించారు. సోమవారం నగరంలోని వెంగళరావు కాలనీ, సత్యనారాయణపురంలో నిర్వహిస్తున్న ఉధృత ఇంద్రధనస్సు కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ 0–5 ఏళ్ల లోపు పిల్లలకు వ్యాక్సినేషన్‌పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. రెండో విడతగా చేపట్టిన డ్రైవ్‌ను విజయవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

బాధ్యతగా సమస్యల పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : స్పందనలో ప్రజలు అర్జీల ద్వారా విన్నవించే సమస్యలను బాధ్యతగా నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్పందనలో మొత్తం 129 వినతులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

19 వరకు ఐటీఐలో అడ్మిషన్లు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో అడ్మిషన్లకు ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశమున్నట్లు కన్వీనర్ రవీంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 7 ప్రభుత్వ, 10 ప్రైవేట్ ఐటీఐలో నాలుగో విడత అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 779967935, 7799933370 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



సమస్యలు తెలుసుకుంటున్న ఏఎస్పీ శ్రీలక్ష్మి

చిత్తూరు అర్బన్: స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వహిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి హెచ్చరించారు. సోమవారం చిత్తూరులోని ఏఆర్ పోలీసు కార్యాలయంలో ఏఎస్పీ సుధాకర్‌తో కలిసి ఆమె ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.



రొంపిచెర్లలో యథావిధిగా వ్యాపారాలు

ఇబ్బందులు లేకుండా!

జిల్లాలో టీడీపీ అధిష్టానం ఇచ్చిన బంద్ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. ఉదయం నుంచి బస్సులు, ఇతర వాహనాలు యథాతథంగా నడిచాయి. దుకాణాలు, బ్యాంక్‌లు సైతం కొనసాగాయి. టీడీపీ ముఖ్యనాయకులు ఎవరూ బయటకు రాకపోవడంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు వచ్చి మమ అనిపించి వెళ్లారు. కొందరు అధిష్టానం దృష్టిలో పడేందుకు నానాతంటాలు పడ్డారు. తాము బంద్‌కు వెళుతున్నామని ముందుగా పోలీసులకు చెప్పి వెళ్లడం కొసమెరుపు. ఇక జనసైనికులు అక్కడక్కడా దుకాణాలు మూసేయాలంటూ రోడ్లపై తిరగడం కనిపించింది. ప్రజలెవ్వరికీ ఇబ్బందులు లేకపోవడంతో సజావుగా తమ కార్యకలాపాలు కొనసాగించారు.

- జిల్లాలో కనిపించని టీడీపీ బంద్ ప్రభావం
- యథాతథంగా నడిచిన బస్సులు, ఇతర వాహనాలు
- తెరిచే ఉంచిన చంద్రబాబు సొంత హెరిటేజ్ సంస్థ
- అమలు కాని టీడీపీ అధిష్టానం ఆదేశాలు

సాక్షి, చిత్తూరు : చంద్రబాబుకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో టీడీపీ పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్ జిల్లాలో తేలిపోయింది. శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా పోలీసు శాఖ 144 సెక్షన్ అమలు చేయడంతో తమ్ముళ్ల ఓవర్‌యాక్షన్‌కు తెరపడింది. తెలుగుదేశం నేతలను పోలీసులు ఎక్కడికక్కడ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో బంద్ ప్రభావం కనిపించలేదు. జిల్లావాసులు తమ దైనందిన కార్య కలాపాలను యథావిధిగా సాగించారు. పోలీసుల అప్రమత్తపై ప్రశంసలు కురిపించారు. చివరకు చంద్రబాబుకు చెందిన సొంత సంస్థ హెరిటేజ్ సైతం మూతపడకపోవడం గమనార్హం.

- కుప్పం నియోజకవర్గంలో బంద్ ప్రభావం పెద్దగా లేదు. కొందరు టీడీపీ నేతలు, కార్యకర్తలు కొన్నిచోట్ల దాడులకు యత్నించగా పోలీసులు అరెస్ట్ చేసి కేసులు నమోదు చేశారు. పూర్తిస్థాయిలో దుకాణాలు తెరుచుకున్నాయి.
- చిత్తూరు నియోజకవర్గంలో బంద్ ప్రభావం కనిపించలేదు. దుకాణాలను బలవంతంగా మూయించేందుకు యత్నించి వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జనజీవనం సాధారణం.
- పలమనేరులో బంద్ ప్రభావం లేదు. ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు మామూలుగానే రాకపోకలు సాగించాయి. దుకాణాలు మూతపడలేదు. వ్యాపారాలు సాధారణంగానే నడిచాయి.
- జీడి నెల్లూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు బంద్ చేయించేందుకు విఫలయత్నం చేశారు.
- పూతలపట్టులో అల్లర్లు సృష్టించేందుకు యత్నించిన టీడీపీ నేతలు, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేయడంతో బంద్ ప్రభావం కనిపించలేదు.
- నగరిలో బంద్ కనిపించలేదు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలు యథావిధిగా నడిచాయి.
- పుంగనూరులో బంద్ ఊసేలేదు. దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగాయి. జన జీవనం మామూలుగా సాగింది.



పలమనేరులో కానరాని బంద్ జాడ

అభివృద్ధి.. సంక్షేమమే లక్ష్యం



కొమ్మిరెడ్డిగారిపల్లె వద్ద సీసీ రోడ్డునిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

- పేదల అభ్యున్నతికే పథకాలు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్రాభివృద్ధి.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం మండలంలో పలు రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కావేటిగారిపల్లె పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలోని మల్లేశ్వరస్వామి ఆలయానికి రూ.5కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. అనంతరం పోశంవారిపల్లె నుంచి పచ్చారాకుల మిట్ట, కొత్తపేట–మంగళంపేట మార్గంలో భోధమ్మత గిరిపై ఉన్న సుబ్రమణ్యస్వామి గుడి వరకు ఏర్పాటు నిర్మించనున్న రహదారులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికే ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమాల్లో టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, విరూపాక్షి జయచంద్రారెడ్డి, నాథముని రెడ్డి, వల్లివేడు రాజారెడ్డి, పోకల చంద్ర, నాగరాజ ప్రసాద్, ఎన్‌ఎస్ రెడ్డి ప్రకాష్, ప్రసాద్, రాఘవరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఆనంద, షైపుల్లా, కృష్ణమూర్తి, యశ్వంత్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, కేశవరెడ్డి పాల్గొన్నారు.

నాటకాలను ప్రజలు నమ్మరు

కుప్పం : స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో రూ.కోట్లు దోచుకుని ఇప్పుడు బంద్‌ల పేరుతో నాటకాలాడితే ప్రజలు నమ్మరని ఎమ్మెల్సీ భరత్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అవినీతికి పాల్పడిన చంద్రబాబును రిమాండ్‌కు పంపితే టీడీపీ నేతలు బంద్‌కు పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు. అందుకే బంద్‌ను ప్రజలు పట్టించుకోకపోవడంతో విఫలమైందని విమర్శించారు. సానుభూతి పొందేందుకు నిరసనలకు దిగితే ప్రయోజనం ఉండదని తెలిపారు. కుప్పంలో కొందరు టీడీపీ నేతలు నానా యాగీ చేయడం తప్ప, ప్రజలు ప్రశాంతంగా ఉన్నారని వెల్లడించారు.



భరత్, ఎమ్మెల్సీ

యాదాద్రిలో ఎంపీ మిథున్‌రెడ్డి పూజలు



ఎంపీ మిథున్‌రెడ్డికి ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి వెంకటేష్

యాదగిరిగుట్ట: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంపీ మిథున్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు పూజలు చేశారు. మిథున్‌రెడ్డి, కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ప్రొటోకాల్ అధికారి వెంకటేష్ లడ్డూ ప్రసాదం అందజేశారు.

వేదిక్‌లో అధీంద్రియ విజ్ఞానం

కోర్సు ప్రారంభం

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో అధీంద్రియవిజ్ఞానం సర్టిఫికెట్ కోర్సు ప్రారంభోత్సవం సోమవారం వర్సిటీలో ఘనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, ప్రత్యేక అతిథిగా రుషీకేశ్‌కు చెందిన క్రియా యోగా కేంద్ర నిర్వాహకులు శ్రీశంకరానందగిరి స్వామి పాల్గొన్నారు. ఈఓ మాట్లాడుతూ ప్రపంచ మానవుల సమస్యలకు సనాతన ధర్మంలోని క్రియాయోగా మార్గం, అధీంద్రీయ విజ్ఞానం ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు. వాటిని మనం నిత్య జీవితంలో ఆచరించడం ద్వారా మానసిక సమస్యల నుంచి బయటపడతామని చెప్పారు. అనంతరం ఉపకులపతి ఆచార్య రాణీ సదాశివమూర్తి మాట్లాడారు. మానవ సమస్యలకు పరిష్కారం చూపేందుకు వేద విశ్వవిద్యాలయంలో అ . దీంద్రియ విజ్ఞానము అనే సర్టిఫికెట్ కోర్సును ప్రవేశపెడుతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ రాధేశ్యామ్, గోలి సుబ్రమణ్య శర్మ, ఫణియాజులు పాల్గొన్నారు.

వారానికి రెండు రోజులు 'చెబుదాం'



సమీక్షిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో రెండు రోజులపాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాంలో ప్రజలు అందించే వినతులను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ నెల 13వ తేదీన సోమల మండలంలో జగనన్నకు చెబుదాం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పౌర సేవల రుసుమును డిజిటల్ అసిస్టెంట్లు 24 గంటల్లోపు సంబంధిత బ్యాంకుల్లో చెల్లించాలన్నారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెండోవిడత రీ సర్వే లో 91 గ్రామాలకు సంబంధించి 1,03,863 సర్వే రాళ్లు వచ్చాయని, అందులో 73,534 రాళ్లు నాటినట్లు చెప్పారు. రాళ్లు నాటే ప్రక్రియను పూర్తి చేసేందుకు తహసీల్దార్, సర్వే శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సమీక్షలో డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్, ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు చంద్రశేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి, శంకర్ బాబు, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

తిరుపతిలో రాష్ట్ర స్థాయి ఆడుదాం-ఆంధ్రా పోటీలు

తిరుపతి అర్బన్: నగరంలో రాష్ట్ర స్థాయి ఆడుదాం- ఆంధ్రా పోటీలు ఉంటాయని తిరుపతి కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. దీనిపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహణకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సామాజిక బాధ్యతగా పరిశ్రమలు, పారిశ్రామికవేత్తలు ఇతర దాతలు సహకారం అందించాలని కోరారు. తిరుపతి జిల్లాలో 691 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 1,57,548 మంది క్రీడాకారులు, మండల స్థాయిలో 78,774 మంది, నియోజకవర్గ స్థాయిలో 3,876 మంది, జిల్లా స్థాయిలో 798 మంది, రాష్ట్రస్థాయిలో 114 మంది తిరుపతి ఎస్వీయూనివర్సిటీ పరిధిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఆడుదాం-ఆంధ్రాలో పాల్గొంటారని వివరించారు. సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రతాప్‌రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నరేంద్ర, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

SAKSHI DIGITAL MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్ ANDHRA PRADESH AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

బృందావన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
డోర్ నెం.6-566/2ఎ, నాగాలమ్మ గుడి ప్రక్కన
సంతపేట, చిత్తూరు

తేది : 16-09-2023 (శనివారం)
సమయం : ఉ. 9.30 గం.ల నుంచి
మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.
రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన
ఫోన్ నంబరు : 97037 74402

ఆదరిస్తూ.. అన్నం పెడుతూ

ప్రభుత్వాస్పత్రికి వచ్చే ప్రజలు ఆకలిదప్పులతో అలమటించకూడదు.. రోగులతోపాటు సహాయకులకు సైతం కడుపు నింపాలి.. రుచికరమైన భోజనంతో స్వాంతన చేకూర్చాలి.. ఇదే లక్ష్యంతో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి మానవత్వాన్ని చాటుకున్నారు. నాలుగు ఏరియా వైద్యశాల్లో సొంత నిధులతో నిత్యాన్నదానానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఈ మేరకు వైఎస్సార్‌సీపీ నేతలు పుంగనూరులో బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- నాలుగు ఆస్పత్రుల్లో మధ్యాహ్నభోజనం
- రోగులు.. సహాయకుల ఆకలి తీర్చడమే లక్ష్యం
- ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి సొంత నిధులతో నిత్యాన్నదానం



పుంగనూరు ఏరియా ఆస్పత్రి వద్ద భోజన పథకం ప్రారంభిస్తున్న శరణ్, నాగభూషణం,భాస్కర్‌రెడ్డి తదితరులు

పుంగనూరు : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని సోమవారం పుంగనూరు ఏరియా ఆస్పత్రిలో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభించారు. నిత్యాన్నదానానికి ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులు వెచ్చించినట్లు ఆస్పత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్ తెలిపారు. ప్రతి రోజూ రోగుల వెంట వచ్చే వారికి రుచికరమైన పప్పు, సాంబారు, రసం, తాళింపు, మజ్జిగతో భోజనం అందించేందుకు చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఇందుకోసం ఆస్పత్రి ఆవరణలో ఓ భవనం కేటాయించినట్లు వెల్లడించారు. అందులో భోజనం చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. అలాగే మదనపల్లె, పీలేరు, బి.కొత్తకోట ఆస్పత్రుల్లో కూడా భోజనం అందించనున్నట్లు తెలిపారు. వైద్యశాలకు రోగులతో వచ్చే వారు మధ్యాహ్న సమయంలో ఆహారం లేక అవస్థలు పడుతున్నారని, అందుకే వారి కడుపు నింపేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి ఈ మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నిత్యం భోజన పంపిణీ కొనసాగుతుందని వెల్లడించారు. గతంలో కోవిడ్ బాధితులను ఆదుకునేందుకు రెండు ఆక్సిజన్ ప్లాంట్లను సైతం ఎంపీ మిథున్‌రెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేయించారని గుర్తుచేశారు. జానపద కళల సంస్థ చైర్మన్ నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ అమ్ము, మెడికల్ ఆఫీసర్ మధుసూదనాచారి పాల్గొన్నారు.

అందరికీ అందిస్తాం



"సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వాసుపత్రికి వచ్చే వారు మధ్యాహ్న సమయంలో ఆకలితో అలమటించకుండా భోజనం పెట్టాలని నిర్ణయించుకున్నా. ఎంతమంది వచ్చినా అందరికీ ఆహారం అందిస్తాం. రోగులతో వెంట వచ్చే వారికి కూడా ఆస్పత్రిలో భోజనం అందిస్తే సంతోషిస్తారని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇందుకు ఎంత ఖర్చయినా సరే వెనకాడే ప్రసక్తే ఉండదు.

– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎంపీ, రాజంపేట

క్లుప్తంగా

టీడీపీ బంద్‌కు ఒకరి బలి

- రోడ్డుపై చెట్టు నరికి పడేసిన పచ్చనేత
- బైక్‌పై వస్తూ ఢీకొని దుర్మరణం పాలైన యువకుడు



నాగరాజు మృతదేహం

తవణంపల్లె : చంద్రబాబు రిమాండ్‌కు నిరసనగా టీడీపీ చేపట్టిన బంద్ కారణంగా ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. వివరాలు.. ఆదివారం రాత్రి చిత్తూరు– అరగొండ ప్రధాన రహదారిలో ఐరాల క్రాస్ వద్ద టీడీపీ స్థానిక నేత గోపి, మరి కొందరు కార్యకర్తలు కలిసి ఓ చెట్టును నరికి రోడ్డుపై అడ్డంగా పడేశారు. ఈ క్రమంలో పట్నం గ్రామానికి చెందిన బి.నాగరాజు(26) అనే యువకుడు స్నేహితుడి బైక్‌పై కాణిపాకం నుంచి వస్తూ చీకట్లో రోడ్డుపై పడి ఉన్న చెట్టు కనిపించక ఢీకొన్నాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో అక్కడికక్కడే మరణించాడు. మృతుడి భార్య చాందిని ఫిర్యాదు మేరకు చెట్టు నరికి రోడ్డుపై పడేసిన టీడీపీ నేత గోపీపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు.

చికిత్సపొందుతూ యువకుడి మృతి

సోమల: మండలంలోని రాంపల్లె వద్ద ఆదివారం రాత్రి ట్రాక్టర్‌పై నుంచి జారి పడి ఓ యువకుడు తిరుపతి రుయాలో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. వివరాలు.. ఆవులపల్లె పంచాయతీ కలమందలవారి పల్లెకు చెందిన ఆనంద తన స్నేహితుడు గంగాధరతో కలిసి ట్రాక్టర్‌లో వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతుడి తండ్రి వీరభద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు తెలిపారు.

ఆటో డ్రైవర్లకు రూ.కోటి కానుకలు



ఆటో డ్రైవర్లకు కానుక అందిస్తున్న విజయానందరెడ్డి



ఆటో కార్మికులతో కలిసి కేక్ కట్ చేస్తూ..

- ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి ఉదారత

చిత్తూరు రూరల్: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి విశేష సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో సుమారు 3వేల మందికి పైగా ఆటోడ్రైవర్లకు ×ఆటో నేస్తం₹ కింద రూ.కోటి విలువైన కానుకలు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.3వేల విలువైన నాలుగు షర్టులు, వాటిని కుట్టించుకోవడానికి రూ.వెయ్యి చొప్పున అందజేశారు. విజయానందరెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి సహకారంతో తన వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

100 మందికి చీరల పంపిణీ

చిత్తూరు కార్పొరేషన్: కట్టమంచిలో ఏపీ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ధీరజ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ మిథున్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 100 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. మిథున్‌రెడ్డి ఆశీస్సులతో రాజకీయాల్లో పలువురు ఎదిగారని కొనియాడారు.



చీరలు పంపిణీ చేస్తున్న ధీరజ్‌రెడ్డి

ఘనంగా ఎంపీ మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ఎస్వీయూలో కేక్ కట్ చేస్తున్న రాయలసీమ విద్యార్థి విభాగం అధ్యక్షుడుహరిప్రసాద్‌రెడ్డి, పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు

- 200 మందికిపైగా రక్తదానం

తిరుపతి సిటీ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఎస్వీ యూనివర్సిటీలో సోమవారం ఘనంగా నిర్వహించారు. రాయలసీమ వైఎస్సాఆర్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు వీ.హరిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆ పార్టీ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీరేంద్ర వర్మ, వై.ఆనందరెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన జన్మదిన వేడుకల్లో భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దిరెడ్డి రమేష్‌రెడ్డి, మురళి, హేమంత్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, దస్తగిరి, తేజేశ్వరరెడ్డి, రమణారెడ్డి, సతీష్‌రెడ్డి, సురేష్ నాయక్, రామకృష్ణ, సదా, శివయాదవ్‌తో పాటు సుమారు 500మందికి పైగా విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం

ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఎస్వీయూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద రాయలసీమ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎస్వీయూ విద్యార్థులతో పాటు నగరంలోని పలు కళాశాలల నుంచి సుమారు 200మందికి పైగా విద్యార్థులు రక్తమిచ్చారు.

ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

తిరుపతి క్రైం: తిరుపతి జూపార్క్ రోడ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఏడుగురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ సురేందర్‌రెడ్డి తెలిపారు. అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలో ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తులను జూ పార్క్ రోడ్‌లో ఆదివారం అలిపిరి సీఐ అబ్బన్న, సిబ్బంది గుర్తించి అరెస్ట్ చేసినట్టు తెలిపారు. ఇందులో అన్నమయ్య జిల్లాకు చెందిన సుంకేసుల మస్తాన్, కానిశెట్టి సుబ్రహ్మణ్యం, గిద్దలూరు సుబ్రమణ్యం, తిరుపతికి చెందిన జైకుమార్, తమిళనాడుకు చెందిన గణేష్ రవి అలియాస్ తమిళ రవి, చిత్తూరు చెందిన పాయని మునిగంధన్ అలియాస్ మణి ఉన్నట్టు తెలిపారు. వీరంతా ముఠాగా ఏర్పడి మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడేవారన్నారు. ఆ తర్వాత వాటిని అమ్ముకుని జల్సాలకు అలవాటు పడేవారన్నారు. ఈ క్రమంలో వారి నుంచి 17 మోటార్ సైకిళ్లు, టాటూ సుమోను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.15 లక్షలు ఉంటుందన్నారు. వీరిపై అలిపిరి పోలీస్ స్టేషన్‌లో 11 కేసులు, ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఏడు కేసులు ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.



పట్టుబడిన వాహనాలతో డీఎస్పీ సురేందర్‌రెడ్డి

రైల్వే అండర్ బ్రిడ్జికి రూ.12.23 కోట్లు

తిరుపతి అర్బన్: తిరుపతి–రేణిగుంట రోడ్డులో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ సమీపంలోని రైల్వే క్రాసింగ్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ గురుమూర్తి రూ.12.23 కోట్లు మంజూరు చేయించారని డెప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వీలైనంత త్వరగా పనులు చేపట్టేలా సహకారం అందిస్తామని వెల్లడించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తిరుపతిలోని అన్ని ప్రాంతాల్లోనూ రోడ్లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పట్టిందని, త్వరలో శ్రీనివాస సేతు అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. తద్వారా ఆర్టీసీ బస్టాండ్‌తోపాటు అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులుండవని వెల్లడించారు.

ముస్తాబు ముమ్మరం



పుష్కరిణి మధ్యలో గణపతి ఆలయానికి విద్యుద్దీపాలు అమర్చుతున్న దృశ్యం

కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 18 నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆలయ రాజగోపురం, పరిసరాలు, పుష్కరిణిని విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. రమనీయంగా రంగవల్లులను తీర్చిదిద్దుతున్నారు. స్వామివారి కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నారు.

– కాణిపాకం(యాదమరి)



రాజగోపురానికి లైట్లు ఏర్పాటు చేస్తున్న కూలీలు



సుపథ మండపంలో రంగవల్లులకు పెయింటింగ్ వేస్తున్న కార్మికులు



ఆలయ ప్రహరీ గోడకు విద్యుద్దీపాలు అలంకరిస్తున్న దృశ్యం

పంట పొలంలో నాటు బాంబులు



పొలంలో బాంబుకోసం గాలిస్తున్న బాంబ్ స్క్వాడ్



బాంబు కోసం వెతుకుతున్న పోలీసులు

- స్వాధీనం చేసుకున్న తమిళనాడు పోలీసులు

నగరి : మండలంలోని నగరి రైల్వేస్టేషన్ నుంచి తెరణి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న పంట పొలంలో నాటు బాంబులను తమిళనాడు పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ఈ నెల 5వ తేదీన చెన్నైకి ఎబినేషర్ అనే రౌడీ షీటర్‌ను శ్రీపెరంబదూర్ సమీపంలో నాటు బాంబు వేసి గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారు. సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను అరెస్టు చేసి విచారించగా తాము ఐదు బాంబులు తీసుకువచ్చామని, అందులో రౌడీషీటర్‌ను చంపేందుకు వినియోగించినట్లు తెలిపారు. మిగిలిన నాలుగు నాటు బాంబులను పారిపోయే క్రమంలో నగరి మండలం తెరణి గ్రామానికి వెళ్లే మార్గంలో ఉన్న పొలాల్లో పడేసినట్లు వెల్లడించారు. దీంతో సోమవారం నగరి పోలీసుల సాయంతో తెరణి గ్రామంలో బాంబులు పడేసిన పొలాల వద్దకు నిందితుడితో పాటు తమిళనాడు పోలీసులు బాంబ్ స్క్వాడ్‌తో పాటు చేరుకున్నారు. వరి సాగులో ఉన్న పొలాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నాలుగు నాటు బాంబులను జాగ్రత్తగా స్వాధీనం చేసుకున్నారు. వీఆర్‌ఓ, స్థానిక పోలీసుల అనుమతితో వాటిని తీసుకెళ్లారు.



పొలంలో పడి ఉన్న నాటుబాంబులు

రేపు జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం సెక్రటరీ శరత్‌బాబు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఎంపిక పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 2005 నవంబర్ 30 తరువాత జన్మించి ఉండాలన్నారు. బరువు, ఎత్తు కలిపి 250 పాయింట్ల లోపు ఉండాలని చెప్పారు. వివరాలకు 8639389796, 7013495493లో సంప్రదించాలని కోరారు.

తుపాకీతో బెదిరిస్తున్నారని ఫిర్యాదు

- టీడీపీ నేతలపై యువతి ఆరోపణ

చిత్తూరు అర్బన్: నగరంలోని శ్రీసాయి గణేష్ సిమెంట్స్, స్టీల్స్ అధినేత మనోహర్‌నాయుడు, మరికొందరు టీడీపీ నేతలు తుపాకీ చూపించి తమను బెదిరిస్తున్నారని ఓ యువతి ఆరోపించింది. సోమవారం ఈ మేరకు చిత్తూరులో నిర్వహించిన పోలీసు స్పందనలో ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మికి ఫిర్యాదు చేసింది. వివరాలు.. మనోహర్‌నాయుడు, జేబీటీ కిరణ్, ఎల్‌డీ సుధాకర్‌నాయుడు, మహేష్ లైంగిక వేధింపులపై బాధిత యువతి గతంలో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఆ యువతి తమ దుకాణంలో పనిచేస్తూ రూ.21 లక్షలను తన కుటుంబ సభ్యుల ఖాతాల్లోకి మళ్లించిందని మనోహర్‌నాయుడు చేసిన ఫిర్యాదుపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఏఎస్పీని కలిసిన యువతి తనకు ఎలాంటి సంబంధం లేకపోయినా తప్పుడు కేసు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేసింది. పైగా మనోహర్ నాయుడు, అతడి అనుచరులు తుపాకీతో వచ్చి చంపేస్తామని బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. మనోహర్ నాయుడుకు పోలీసు శాఖలో చాలా మంది స్నేహితులు ఉన్నారని, దీంతో తమపై బెదిరింపులకు దిగుతున్నాడని వెల్లడించింది. మనోహర్‌నాయుడు తదితరులపై హత్యాయత్నం, లైంగిక వేధింపుల కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి విచారిస్తామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. మరోవైపు ఈ కేసులో దర్యాప్తు అధికారిని మార్చనున్నట్లు సమాచారం.



కుటుంబసభ్యులతో కలిసి ఏఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న యువతి

మద్యం దుకాణం క్యాషియర్‌పై దాడి

తడ: ప్రభుత్వ మద్యం దుకాణం క్యాషియర్‌పై దాడి చేసి, నగదు దోచుకెళ్లిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్‌ఐ జేపీ.శ్రీనివాసరెడ్డి కథనం.. రామాపురం మద్యం దుకాణంలో బీవీపాళెం గ్రామానికి చెందిన ప్రభు పనిచేస్తున్నాడు. శని, ఆదివారాలు సెలవు కావడంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు వసూలైన నగదును తడ బ్యాంకులో జమచేసేందుకు స్కూటీపై బయలు దేరాడు. అదే సమయంలో ల్యాప్ టాప్‌కు పాచ్ వేయించేందుకు దానిని కూడా వెంట తీసుకు బయలు దేరాడు. ఈ క్రమంలో రామాపురం బ్రిడ్జి దిగుతున్న సమయంలో వెనుక మరో బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు స్కూటీని కాలుతో తన్నడంతో ప్రభు కిందపడిపోయాడు. వెంటనే ఇద్దరు దుండగులు తమ వెంట తెచ్చుకున్న కత్తిని చూపి, ఆపై ప్రభుని కొట్టి అతని వద్ద ఉన్న నగదు, లాప్‌ట్యాప్‌ను అపహరించుకుని వెళ్లిపోయారు. సమాచారం అందుకున్న మద్యం దుకాణం సిబ్బంది గాయపడ్డ ప్రభుని తడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రైల్వే స్టేషన్ యార్డు సమీపంలో రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని రైల్వే కీమెన్ సోమవారం గుర్తించి సూళ్లూరుపేట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్‌ఐ జీ.మాలకొండయ్య, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారి పడి ఉండవచ్చని ఎస్‌ఐ తెలిపారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల మధ్య ఉంటుందన్నారు. మృతుడు మెరున్ రెడ్ కలర్ టీ షర్టు, లైట్ బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నట్టు వెల్లడించారు. ఈ మేరకు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాల పోస్టుమార్టం గదిలో భద్రపరిచినట్టు ఆయన పేర్కొన్నారు.